నేడు మహిళలకు జాబ్‌మేళా

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌లో ఈ నెల 18న ప్రత్యేకంగా మహిళలకు నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక సంస్థ అయిన బ్రహ్మకుమారి, నిర్మాణ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 28 ఏళ్లలోపు మహిళలకు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీలతో పాటు ఉత్పాదక రంగం, ఐటీఈఎస్, రీటైల్, ఫార్మ, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, బీపీఓ రంగాల రిక్రూట్‌మెంట్ చేయనున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు గాయత్రీనగర్, హరిహర క్షేత్రం దేవస్థానం సమీపంలో ప్లాట్ నంబర్-42లో హాజరు కావాలని కోరారు. విద్యార్హతలు తెలిపే రెజ్యూమ్‌తో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తెచ్చుకోవలసిందిగా కోరారు. మరిన్ని వివరాలకు 9154145734 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆలయానికి విరాళం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ, దత్తాత్రేయ కాలనీలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, స్థల సేకరణకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత 50 వేల రూపాయలు విరాళాన్ని గురువారం అందజేశారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని విరాళమిచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో వేదాంతగోష్టి

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ శ్రీ శృంగేరి శారద శంకరమఠంలో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు వేదాంత పఠనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సిఎస్ఆర్ మూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 19 శనివారం 9.30 నుంచి 11.15 గంటల వరకు బ్రహ్మశ్రీ నారుమంచి అనంతకృష్ణచే వేదాంత పరిచయం, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలకు వరకు డా. కుప్పా విజయశ్రీచే గురుస్సాక్షాత్ పరబ్రహ్మ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

జ్యూట్ బ్యాగులు వాడాలి



తహశీల్దార్ రహమాన్‌కు బట్టసంచులను అందజేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరు బట్ట సంచులను, జ్యూట్‌తో తయారు చేసిన వాటినే వినియోగించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్ తహశీల్దార్ అబ్దుల్ రహమాన్‌ను కలిసి 100 బట్ట సంచులను అందజేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రతి మండల కార్యాలయంతో పాటు జీహెచ్‌యంసి సర్కిల్ కార్యాలయంలో ఉన్న డివిజన్‌లలో దశలవారీగా సంచులను పంపిణీ చేస్తామని తెలిపారు. తహశీల్దార్ రహమాన్ మాట్లాడుతూ కూరగాయలు, నిత్యావసర వస్తువులకు బట్ట సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో లియో అన్నెం తనూజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, మరో ముగ్గురికి రెండు రోజుల జైలు ,మరో వ్యక్తికి మూడు రోజులు, మరో వ్యక్తికి ఒకరోజు జైలుతో పాటు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఘనంగా బోనాల సమర్పణ



గచ్చిబౌలి: నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా మహిళలు ఘనంగా బోనాలు సమర్పించారు. కొత్తగూడలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు గ్రామస్తులు ఇంటి నుంచి బోనాలతో ఊరేగింపుగా భారీ సంఖ్యలో తరలి వచ్చారు. నాభిశిల వద్ద బోనం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం పటం వేయుట, రంగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ట్రాఫిక్ సీఐ లాలూనాయక్



పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపారు.గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నవపాన్ సమీపంలో, ముత్తంగి ఓఆర్ఆర్, లక్డారం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ సూచనల మేరకు, రోడ్డు కాంట్రాక్ట్ వర్కర్ల సహకారంతో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేశామన్నారు. అదేవిధంగా జాతీయ రహదారిపై మట్టిని తొలగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే

కఠిన చర్యలు

గంజాయి తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్



“గంజాయి అమ్మితే కఠిన చర్యలు తప్పవని శేరిలింగంపల్లి మండలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, గంజాయి కేసులలో పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వీకర్ సెక్షన్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని, విక్రయదారుల కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. -చందానగర్”

ప్రశ్న: శేరిలింగంపల్లి మండలంలో ఇప్పటి వరకు పట్టుకున్న గంజాయి ఎంత ?

జవాబు: శేరిలింగంపల్లి మండలంలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 750 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నాం. దీనికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాం.

ప్ర : మండలంలో పీడీ యాక్టులు, గంజాయి కేసులు నమోదయ్యాయా..?

జ : గంజాయి, గంజాయి చాక్లెట్లు, అక్రమంగా వైన్, విదేశీ మద్యం తయారు చేస్తున్న వారిపై పదుల సంఖ్యలో కేసులు నమోదు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 5 పీడీ యాక్టు కేసులు కూడా నమోదు చేశాం.

ప్ర:మండలంలో ఎన్ని వైన్స్, బార్లు ఉన్నాయి ?

జ : శేరిలింగంపల్లి మండలంలో మొత్తం వైన్ షాపులు 39, బార్‌లు 112 ఉన్నాయి. బెల్ట్ షాపులు, గుడుంబా విక్రయాలు పూర్తిగా మూసివేయించాం. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ప్ర : యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడుతున్నారు..అవగాహన కల్పిస్తున్నారా..

జ: యువత మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి. ఒక్కసారి వాటిని తీసుకుంటే బానసలుగా మారిపోతారు. శేరిలింగంపల్లి మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల నడవడికను గమనిస్తుండాలి.



శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

ప్ర: పీడీ యాక్టు కేసులు ఎలా నమోదు చేస్తారు ?

జ: గంజాయి విక్రయం, సరఫరా చేస్తూ రెండు నుంచి మూడుసార్లు పట్టుబడితే పీడీ కేసు నమోదు చేస్తాం.

ప్ర: ఎక్సైజ్ స్టేషన్ నూతన భవనం నిర్మాణం ఎప్పుడు ?

జ: ప్రస్తుతం చందానగర్‌లో ఉన్న శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అద్దె భవనంలో ఉంది. మండలంలోని గోపన్‌పల్లి సర్వే నెంబర్ 37లో 600 గజాల స్థలాన్ని కేటాయించారు.రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

అభివృద్ధికి సహకారమందించండి

భెల్ ఈడీని కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



భెల్ ఈడీ కే.బి.రాజాకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గురువారం భెల్ ఈడీ కే.బి.రాజాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలోని ప్రజా సమస్య పరిష్కారంలో భెల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, ప్రధానంగా కాలనీలో భూగర్భడ్రైనేజీ పనులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా పలుచోట్ల రోడ్లను మూసివేశారని ప్రజల సౌకర్యార్థం వాటిని వెంటనే తెరిపించాలని కోరారు. అంతర్గత రహదారుల మరమ్మతులకు అనుమతించాలని ,ఎస్టేట్ అధికారుల అభ్యంతరాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై భెల్ యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని ,సహకారమందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ లచ్చిరాం నాయక్, బాలాజీ, సరిత, పాపని, నాయకులు మల్లారెడ్డి, రవీందర్‌లు పాల్గొన్నారు.

‘వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తాం’



మాట్లాడుతున్న ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి

చందానగర్: వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చేలా యూనియన్ పనిచేస్తుందని ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ చేపడుతున్నామని, మొదటగా శేరిలింగంపల్లి నుంచి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో సలీమ్ పాషా, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ,, తిరుపతిరెడ్డి, మాధవ్‌రెడ్డి, ప్రసాద్, శ్యామ్, ప్రణయ్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువును అభివృద్ధి చేస్తాం



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ పుష్పనగేష్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాసనగర్ కాలనీ బస్సు రోడ్డు, కాకతీయనగర్ కాలనీలోని సీసీ రోడ్డు నిధుల మంజూరు, అభివృద్ధి పనుల పెండింగ్‌పై అధికారులతో సమీక్ష చేశారు. బాలవిహార్ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. జ్యోతినగర్ కాలనీలో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మయూరినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మంత్రి, ఎమ్మెల్యేల సహకారంతో రాయసముద్రం చెరువును మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ సురేష్, ఇరిగేషన్ డీఈ నళిని, ఇంజనీరింగ్ విభాగం డీఈ నరేందర్, ఏఈలు పావని, ప్రభు పాల్గొన్నారు.

రేపు యోగా పోటీలు

కేపీహెచ్‌బీ కాలనీ: రేపు జేఎన్‌టీయూహెచ్‌లో యోగా, సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నారు. విశ్వ మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు జేఎన్‌టీయూ గ్రౌండ్స్‌లో యోగా పోటీలు ఉంటాయని సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఉత్తమ సాధకులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యోగాభ్యాసం, ధ్యానం, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.18 వేలు చెక్కును ఎమ్మెల్యే గాంధీ గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. భెల్ ఎంఐజీ కాలనీకి చెందిన సాయినాథ్ వైద్య ఖర్చులకు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదన్నారు.

అయ్యప్ప మాలధారులకు ఉచిత అన్నప్రసాదం



కేపీహెచ్‌బీకాలనీ: అయ్యప్ప దీక్షలో ఉన్న ఉద్యోగులకు మధ్యాహ్న భోజనానికి ఆటంకం రాకుండా అన్న ప్రసాదాన్ని తమ కార్యాలయాలకు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. కేపీహెచ్‌బీ మూడవ ఫేజ్‌లోని పోచమ్మ ఆలయం వద్ద గురువారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలధారులు మధ్యాహ్నం ఇక్కడి నుంచి అన్న ప్రసాదాన్ని ఉచితంగా తీసుకు వెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమం జనవరి 10 వరకు కొనసాగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గురుస్వాములు బిఎస్ఎన్ రాజు, బుట్ట రాంబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

చందానగర్ : ఆదికవి మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని గురువారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ శ్రీ రామాయణాన్ని మహా కావ్యంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నతుడు మహర్షి వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో ఈఈ కెవిఎస్ రాజు, ఏఎంసీ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తదితరులు

బీజేపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్



చందానగర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఇన్‌చార్జ్ రవికుమార్‌యాదవ్

చందానగర్: బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే శేరిలింగంపల్లి అగ్రగామిగా నిలిచే లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రతి నాయకుడు, కార్యకర్త భాగస్వామి కావాలని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ రవికుమార్‌యాదవ్ అన్నారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం వద్ద బీజేవైఎం నాయకులు ఫిరంగి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని ముఖ్య నాయకులంతా విధిగా 500లకు మించకుండా సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి, రాజు, సుధాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధికి కేటాయించండి

కలెక్టర్ వల్లూరి క్రాంతిని కోరిన ఎమ్మెల్యే



కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందించారు. ప్రధానంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాల పరిధిలో గల వందలాది పరిశ్రమలు తమ లాభాల్లో కొంత భాగాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కి కేటాయించి, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నిధులను స్థానికంగా అభివృద్ధికి కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కేటాయించడం మూలంగా, పరిశ్రమలకు భూములు అందించి కాలుష్యం మూలంగా ఇబ్బంది పడుతున్న స్థానిక గ్రామాల ప్రజలు అభివృద్ధికి దూరం అవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో.. పరిశ్రమలు నెలకొల్పిన గ్రామాల పరిధిలోనే సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో అభివృద్ధి పనులకు బిల్లులు రాక తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

ఎల్లమ్మ చెరువు

అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో భాగంగా మురుగునీటి మళ్లింపు పైపులైన్ నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచాలన్నారు. చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్, అలుగు నిర్మాణం, సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 2024-25 విద్యా సంవత్సరానికి బీఈడీ(ఓడీఎల్) కోర్సులో చేరేందుకు సర్వీస్ టీచర్లలో డీఈఐ, ఈడీ పాస్ అయినవారు ప్రవేశాలకు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 30గా నిర్ణయించారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ అడ్మిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంది. దరఖాస్తు ఫారమ్‌ను రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ప్రవేశ పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు స్టూడెంట్ సపోర్ట్ యూనిట్(ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్ నంబర్ 040-23008463 లేదా 040-23120600 (ఎక్స్‌టెన్షన్-2207, 2208) ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సంప్రదించవచ్చు.

కవులు, కళాకారుల పాత్ర కీలకం

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: సమాజంలో కవులు, కళాకారుల పాత్ర కీలకమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. నల్లగండ్ల హుడా కాంప్లెక్స్‌లో శేరిలింగంపల్లి సాహితీ, సాంస్కృతిక కళాసేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కవి సమ్మేళనం, కవుల ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయడంతో కవులు, కళాకారులు, రచయితల పాత్ర ముఖ్యమైనదన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై ఉద్యమించడం, రచయితల పోరాట స్ఫూర్తికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవీంద్రబాబు ఆరవా, గనులశాఖ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ వి.డి.రాజగోపాల్, ప్రముఖ పారిశ్రామిక వేత్త వినోద్‌గౌడ్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్, డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రావు , రామకోటేశ్వర్‌రావు, సుమచంద్ర, డీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సూచించారు. సురభి కాలనీ ప్రైమరీ స్కూల్‌లో కొత్త ఉపాధ్యాయులకు గురువారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ బసవరాజ్, వైస్ చైర్మన్ సుమలత, వార్డు మెంబర్ శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు